క్లుప్తంగా

గ్యాస్ గోడౌన్ తనిఖీ


సిలిండర్‌ను తూకం వేయిస్తున్న ఐటీసీఎస్‌ఓ భాస్కరరావు

అర్ధవీడు (బేస్తవారిపేట): స్థానిక జగదీశ్ ఇండియన్ గ్యాస్ గోడౌన్‌ను ఐటీసీ ఎస్‌ఓడీ భాస్కరరావు శనివారం తనిఖీ చేశారు. వినియోగదారులు గ్యాస్ సిలిండర్ తీసుకొనేటప్పుడు సరైన తూకం ఉందో లేదో సరిచూసుకోవాలని కోరారు. పదిహేను కిలోమీటర్ల దూరం వరకు ఎటువంటి డెలివరీ చార్జీలు చెల్లించాల్సిన అవసరం ఉండదని, గ్యాస్ ధరకు మించి అదనంగా చెల్లించమని కోరితే ఫిర్యాదు చేయాలని కోరారు. కంపెనీ సూచించిన గ్యాస్ పైపులు, రెగ్యులేటర్ వాడాలని సూచించారు.

శాకాహారంతో ఆరోగ్యం


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొమరోలు: శాఖాహారం తీసుకోవడం వలన ఆరోగ్యానికి మంచిదని పిరమిడ్ ధ్యాన మందిరం నిర్వాహకులు సుబ్బారావు తెలిపారు. కొమరోలు పట్టణంలోని శివసాయి ధ్యాన మందిరం ఆధ్వర్యంలో శనివారం హింసా చోడో హంసా పకడో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కొమరోలు పురవీధుల్లో నిర్వాహకులు విద్యార్థులచే ర్యాలీని నిర్వహించారు. శాఖాహారమే ముద్దు, మాంసాహారం వద్దూ అంటూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా రేణుకారెడ్డి


ప్రశంస పత్రం అందుకుంటున్న రేణుకారెడ్డి


పొదిలి: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా స్థానిక ఆల్ఫా హైస్కూలు మ్యాథ్స్ ఉపాధ్యాయిని జక్కం రేణుకారెడ్డి ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ ప్రాస్పర్టీస్ అసోసియేషన్ విజయవాడ వారి ఆధ్వర్యంలో ఈఎంపికలు జరిగాయి. సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో రేణుకారెడ్డిని శాలువాతో సత్కరించి ప్రశంస పత్రం అందజేశారు. ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవేందర్‌రెడ్డి, ఆంధ్రకేసరి రిజిస్ట్రార్ బి.హరిబాబు, డీన్ ఫ్యాకల్టీ ఇన్ ఎడ్యుకేషన్ నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ స్వరూప, పలు కళాశాలల ప్రొఫెసర్లు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం


వారోత్సవాల్లో ఐసీడీఎస్ సిబ్బంది

మార్కాపురం టౌన్: చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం వస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.లలిత సలోమి అన్నారు. శనివారం రాయవరం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. గ్రామంలోని తల్లులను పిలిపించి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే ఆహారం తయారు చేసి వంటలను ప్రదర్శించారు. గర్భిణులు, పాలిచ్చే తల్లులు రక్తహీనతపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలన్నారు. తల్లులు అంగన్‌వాడీ కేంద్రాల్లో పాలు, గుడ్లు, బాలామృతం ఉపయోగించుకోవాలన్నారు. బృహస్పతి, నాగలక్ష్మి, సిబ్బంది, పాల్గొన్నారు.

జీఓ నంబర్ 115 రద్దు చేయాలి


కంభంలో సూపరింటెండెంట్‌కు వినతి పత్రం ఇస్తున్న నర్సులు

కంభం: ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్ పోస్టులను కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సు, ఎన్‌హెచ్‌ఎం స్టాఫ్ నర్స్ లను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయాలని కోరుతూ శనివారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ శివనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఏఎన్‌ఎం టు జీఎన్‌ఎం దాకా ఇంటెన్సిఫైడ్ ప్రోగ్రాం వారికి నర్సింగ్ ఉద్యోగాలు.. జీతాలు ఇవ్వాలని జీవో 115 విడుదల చేశారన్నారు. దీనివల్ల చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్న తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. నర్సింగ్ వ్యవస్థకు జరుగుతున్న అన్యాయాలను వివరిస్తూ ఇంటెన్సిఫైడ్ ప్రోగ్రాం ఆపాలని, స్టాఫ్ నర్సు పోస్టులను స్టాఫ్ నర్సులకు మాత్రమే ఇవ్వాలని గతంలో మంత్రి నారా లోకేష్‌కు, ఉప ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రులకు వినతి పత్రాలు ఇచ్చామని తెలిపారు. తక్షణమే జీవోను ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు.

జోరుగా కొర్ర పంట కోతలు


గంగంపల్లెలో సాగు చేసిన కొర్ర పంట


కొర్ర పంటను కోస్తున్న యంత్రం

రాచర్ల: కొర్ర సాగు రైతులు ఆనందంగా ఉన్నారు. రాచర్ల మండలంలో ఆకవీడు, జి.కొత్తపల్లి, గుడిమెట్ట, గంగంపల్లె, అచ్చంపేట, జేపీ చెరువు, కొత్తూరు, రాచర్ల, ఒబుల్‌రెడ్డిపల్లె, సత్యవోలు, రాచర్లఫారం, రంగారెడ్డిపల్లె, యడవల్లి, మేడంవారిపల్లె, ఒద్దులవాగుపల్లె గ్రామాల్లో దాదాపు 827 ఎకరాల్లో కొర్ర సాగు చేశారు. అయితే ఆకవీడు, గంగంపల్లె, ఒబుల్‌రెడ్డిపల్లె, సత్యవోలు, రాచర్ల, యడవల్లి, రంగారెడ్డిపల్లెలోనే 300 ఎకరాల పంటను సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు వివరించారు. ప్రస్తుతం కొర్ర పంట కోత దశకు రావడంతో రైతులు యంత్రాల సహకారంతో కోతలు కోస్తున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది కొర్ర పంట దిగుబడి తగ్గినట్లు రైతులు వివరించారు. ఈ ఏడాది కొర్ర పంట సాగు చేసిన రోజు నుంచి వర్షాలు లేకపోవడం ఒక కారణంగా కాగా కోతకు వచ్చే వరకు అడపదడపా వర్షాలు కురుస్తుండటంతో కొర్ర పంట దిగుబడి తగ్గింది. అటవీ ప్రాంతాలకు అనుకుని ఉన్న అకవీడు, గంగంపల్లె, ఒబుల్‌రెడ్డిపల్లె, సత్యవోలు, జేపీ చెరువు, రాచర్ల గ్రామాలకు అడవి పందుల బెడద తీవ్రంగా ఉండటంతో సోలార్ కరెంటు ఏర్పాటు చేసుకుని పంటను దక్కించుకున్నారు. ఈ ఏడాది నల్లరేగడి భూముల్లో ఎకరాకు 4 నుంచి 5 క్వింటాలు రాగా, ఎర్ర భూముల్లో 3 నుంచి 4 క్వింటాల వరకు కొర్ర పంట దిగుబడి వచ్చినట్లు రైతులు తెలిపారు. యంత్రానికి ఎకర కొర్ర పంట కోత కోసేందుకు రూ.2 వేల వరకు ఖర్చు అవుతుందని, శ్రమ కూడా తగ్గిందని రైతులు వివరించారు.

ట్రాఫిక్ కంట్రోల్‌పై నూతన ఆవిష్కరణ


ట్రాఫిక్ నియంత్రణ పరికరాలను చూపుతున్న కిట్స్ కళాశాల విద్యార్థులు

మార్కాపురం: స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ట్రాఫిక్ రద్దీ నియంత్రించే సమాచారం చేరవేసే నూతన ప్రయోగాన్ని ఆవిష్కరించినట్లు కళాశాల చైర్మన్ అన్నా కృష్ణచైతన్య తెలిపారు. బీటెక్ విద్యార్థులు కె.సుభాషిని, బి.రాఘవేంద్రరెడ్డి, వి.అర్చన, ఎం.లక్ష్మీనారాయణ రియల్ టైమ్ ట్రాఫిక్ డేటాను సేకరించేందుకు, ప్రాసెస్ చేయటానికి, స్టోరేజీకి, ఓటీ ఆధారిత సిస్టం తయారు చేశారు. రోడ్ సైడ్ మెసేజ్ యూనిట్ ద్వారా ట్రాఫిక్ రద్దీ, అసాధారణ ట్రాఫిక్ సంఘటనలపై రియల్ టైమ్ ట్రాఫిక్ అప్‌డేట్‌లను అందించటం ఈ ప్రయోగ లక్ష్యమన్నారు. రద్దీ ఎక్కువ ఉన్న సమయంలో ముందస్తు హెచ్చరిక, సందేశాలను పంపటం ద్వారా వాహనదారులు తమ సమయాన్ని దుర్వినియోగం కాకుండా ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బంది పడకుండా ఇతర మార్గాల ద్వారా వెళ్లేందుకు ఉపయోగపడుతుందన్నారు. కళాశాల సిబ్బంది డాక్టర్ అన్నా రంగనాయకులు, డి.సత్యనారాయణ, ఏ.ప్రసాద్, పి.అనిల్‌కుమార్ అభినందించారు.

అవును.. మా వాళ్లు అవినీతి పరులే!

● రేషన్ దందాపై మంత్రికి టీడీపీ నేత ఫిర్యాదు


మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతి పత్రం అందిస్తున్న మల్లికార్జున నాయుడు

యర్రగొండపాలెం: ఇప్పటి వరకు ప్రతిపక్షాలు చేసేది కేవలం ఆరోపణలే అని ఆ పార్టీ పెద్దలు గగ్గోలు పెడుతుంటే.. కాదు, టీడీపీ వారి అక్రమాలు నిజమే అని ఆ పార్టీవారే ఫిర్యాదులు చేస్తున్న పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలో విచ్చలవిడిగా జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమ దందాపై టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నలగాటి మల్లికార్జున నాయుడు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి వినతిపత్రం అందించడం గమనార్హం. పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం అక్రమార్కులు పక్కదోవ పట్టిస్తున్నారని, వారి భరతం పట్టి రేషన్ అక్రమ రవాణాకు బ్రేకులు వేయాలని కోరినట్లు ఆయన శనివారం తెలిపారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని, అక్రమ రవాణా నివారిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

ఆహ్లాదం.. ఆక్రోశం


రోడ్డు వెంట ఏపుగా పెరిగిన చెట్లు


లోతైన గుంతలతో అధ్వానంగా మారిన రోడ్డు

బేస్తవారిపేట: మండల కేంద్రం బేస్తవారిపేట నుంచి చిన్న కంభం వెళ్లే రోడ్డు వెంట పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా ఉంది. గతంలో వాకర్స్ వివిధ రకాలు మొక్కలు నాటి సంరక్షణ చేశారు. అవి నేడు ఏపుగా పెరిగి దారి వెంట నీడ ఇస్తున్నాయి. అయితే ఈ తారురోడ్డు అధ్వానంగా మారింది.
అడుగు అడుగునా లోతైన గుంతల వల్ల రాకపోకలకు నరకయాతనగా మారింది. ఈ రోడ్డుపై నిత్యం చిన్న కంభం, జేబీకే పురం, బేస్తవారిపేట గ్రామస్తులు రాకపోకలు సాగిస్తూ మాకేంటి ఈ శిక్ష అని ఆవేదన చెందుతున్నారు.

డ్రిప్ అక్రమ మంజూరుపై ఫిర్యాదు

కొనకనమిట్ల: తన పొలంలో బోరు లేకుండా, పంట సాగు చేయకుండానే అధికారులు డ్రిప్ పైపులు మంజూరు చేయడంపై మండలంలోని చింతగుంట గ్రామ మాజీ సర్పంచ్ రాగి గురవయ్య ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు శనివారం తెలిపారు. వివరాలు.. చింతగుంట గ్రామానికి చెందిన వసంతపురం వెంకటచెన్నయ్యకు ఆరు ఎకరాల అసైన్‌మెంట్ భూమి ఉంది. దీనిలో వర్షాధార పంటలు సాగు చేస్తుంటాడు. అయితే వెంకటచెన్నయ్య తన పొలంలో బోరు ఉన్నట్లు, పంటలు సాగు చేస్తున్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించి సంబంధిత అధికారులకు తెలియజేసి అక్రమంగా పూర్తి రాయితీపై డ్రిప్ పైపులు మంజూరు చేయించుకున్నారని ఆరోపించారు. బోర్లు లేకుండా పంటలు సాగు చేయకుండా ఏ అర్హతతో వెంకటచెన్నయకు వేల రూపాయలు విలువ చేసే డ్రిప్, పైపులు మంజూరు చేస్తారని మాజీ సర్పంచ్ గురవయ్య ప్రశ్నించారు. ఇలా మంజూరు చేయటంపై జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకుఅర్జీలుఇచ్చినట్లుగురవయ్యఅన్నారు.

గణనాథునికి ప్రత్యేక అలంకరణలు


కూరగాయలతో గణనాథుని ప్రత్యేక అలంకారం


వివిధ రకాల బెలూన్‌లతో విఘ్నేశ్వరునికి అలంకారం


తర్లుపాడు బీసీ కాలనీలో వినాయకుడు

మార్కాపురం: వినాయకునికి ప్రత్యేక అలంకరణలు, పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు పట్టణంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం అర్చకులు, భక్తులు, ఉభయదాతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పేరంబజారులో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద వివిధ రకాల కూరగాయలతో అలంకరించి పూజలు చేశారు. ఎస్ఎస్ నగర్‌లో ప్రత్యేక పూజలు జరిగాయి.
తర్లుపాడు: స్థానిక బీసీ కాలనీలోని వినాయకునికి శనివారం కాలనీవాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు నిండాలని వేడుకున్నారు.

పంటలను పరిశీలించిన గుజరాత్ బృందం


పంటలను పరిశీలిస్తున్న గుజరాత్ రైతులు

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్లలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పలు రకాల పంటలతో పాటు పండ్ల తోటలను గుజరాత్‌కు చెందిన పలువురు రైతులు, వ్యవసాయ సిబ్బంది శనివారం పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి ఆధ్వర్యంలో పంటలను పరిశీలించి ఆమె ద్వారా సాగు పద్ధతులు, వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళా రైతు సుజాత మాట్లాడుతూ తాను 40 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు వివరించారు. 40 ఎకరాల్లో అంతర పంటలుగా కంది, సజ్జ, జొన్న, పెసర సాగు చేశామన్నారు. కూరగాయల పంటలతో పాటు మామిడి, సపోట, ఉసిరి, అరటి, నిమ్మ, దానిమ్మ, సీతాఫలంతో పాటు శ్రీగంధం, ఎర్రచందనం సాగు చేశానని తెలిపారు. ఇంకా వరి, పసుపు పంటలు సాగులో ఉన్నాయన్నారు. సేంద్రియ ఎరువులతోనే పంటలు మంచిగా పండిస్తున్నట్లు సుజాత వారికి వెల్లడించారు. పంటలకు ద్రవజీవామృతం వాడటం వల్ల భూమి సారవంతంగా తయారవుతుందని వివరించారు. సేంద్రియ ఎరువులు వాడటం వల్ల పైరుకు పెద్దగా క్రిమికీటకాలు ఆశించవన్నారు. వ్యవసాయాధికారి ప్రసన్న రంగలక్ష్మి, వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి


పొదిలి: నివాళులర్పిస్తున్న అసోసియేషన్ నాయకులు


గిద్దలూరు: నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పొదిలి: స్థానిక పెన్షనర్ల భవనంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ శనివారం జరిగింది. ఆయన చిత్రపటానికి ముందుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలకు ఆయన చేసిన సేవల గురించి నాయకులు మాట్లాడారు. పొదిలి తాలూకా అధ్యక్షుడు ఏ.బాదుల్లా, గౌరవాధ్యక్షులు ఏ.వీరారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, డీఎల్ నరసింహం, ఎస్‌కే మదార్‌వలి, కె.యల్లమందారెడ్డి, కరాముల్లా బేగ్, డి.దానమ్మ, ఆర్.శారమ్మ, గోవిందయ్య, మూసా జానీ, ఆశీర్వాదం, కోదండ రామయ్య పాల్గొన్నారు.
గిద్దలూరు రూరల్: స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సీతారాం ఏచూరికి శనివారం నివాళులర్పించారు. సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య మాట్లాడుతు ప్రజల పక్షం నిరంతరం పోరాడే నాయకుడిని కోల్పోవడం చాలా బాధాకరమమన్నారు. యూటీఎఫ్ సత్యనారాయణరెడ్డి, సుధాకర్ రెడ్డి, ముఠా కార్మిక సంఘం నాయకులు పి.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీ.. గేదె మృతి


మృతి చెందిన గేదె

గిద్దలూరు రూరల్: పట్టణ శివారులోని నంద్యాల రోడ్డులో గల సీఎస్ఐ చర్చి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొని ఓ పాడిగేదె మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. ఓ వాహనం రోడ్డును క్రాస్ చేస్తున్న పాడిగేదెను ఢీ కొట్టింది. దీంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ అక్కడ నుంచి పారిపోయినట్లు స్థానికులు తెలిపారు.

ఎంఈవో కార్యాలయం ప్రారంభం

మార్కాపురం టౌన్: నియోజకవర్గ కేంద్రం మార్కాపురంలో విద్యా శాఖాధికారుల కార్యాలయాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి శనివారం ప్రారంభించారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న ఎంఈవో కార్యాలయాన్ని సుమారు రూ. 10 లక్షలతో ఆధునీకీకరించారు. డిప్యూటీ ఈవో చంద్రమౌళీశ్వర్, ఎంఈవోలు రాందాస్ నాయక్, శ్రీనివాసులు, పలువురు హెచ్‌ఎంలు, ఎమ్మెల్యే సోదరుడు రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

కంభం: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డిగ్రీ విద్యార్థులకు జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కంభం కౌన్సిలర్ జి. రాజకుమార్ తెలిపారు. ఈ నెల 19 నుంచి 20 వరకుఆన్‌లైన్ క్విజ్ నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు, పేర్లు నమోదుకు 9154301314 నంబరును సంప్రదించాలని కోరారు.

లోక్ అదాలత్‌లో 512 కేసుల పరిష్కారం

మార్కాపురం: లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం లభిస్తుందని మార్కాపురంలోని జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి ఎం.శుభవాణి అన్నారు. శనివారం మార్కాపురం కోర్టు సముదాయంలో నేషనల్ లోక్ అదాలత్ ద్వారా 512 కేసులు పరిష్కరించారు. వీటిలో 9 యాక్సిడెంట్ కేసులు, 42 సివిల్, ఒక వివాహ సంబంధ కేసు, 6 మనోవర్తి, 8 గృహ హింస, 124 క్రిమినల్, 20 చెక్కు బౌన్సు, 12 బ్యాంకు, 290 పెట్టి కేసులను పరిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి దేవేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కిషోర్‌కుమార్, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బాలాజీ ప్రిసైడింగ్ ఆఫీసర్లుగా వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూపని కాశయ్య, బేగం కరిమున్నీ, కడియాల రామయ్య, ఝాన్సీరాణి, అశోక్‌నాయక్, వెలుగొండయ్య, తదితరులు అదాలత్ మెంబర్‌లుగా వ్యవహరించారు.
గిద్దలూరు రూరల్: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో మొత్తం 405 కేసులు పరిష్కారం అయ్యాయి. పట్టణంలోని కోర్టు ఆవరణలో గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ. ఓంకార్, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీ సారాదానమ్మ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. రూ.86,92 487 నగదు లావాదేవీలు జరిగాయి. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా ప్రయత్నించాలని జడ్జిలు కోరారు. సీఐలు కె.సురేష్, రామకోటయ్య, న్యాయవాదులు పిచ్చయ్య, రవిప్రకాష్ బాబు పాల్గొన్నారు.